మౌలిక వసతుల కల్పనలో రాజీపడేది లేదు

● కార్పొరేటర్ శ్రీనివాసరావు



భూగర్భ డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. డ్రీమ్ వ్యూ కాలనీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అసోసియేషన్ల సభ్యులతో కలిసి కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యకు పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే ప్లే పార్కులో క్రీడా పరికరాల గురించి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, నరసింహారావు, నాగయ్య, ప్రణయ్, అరుణ, జయలక్ష్మి, శ్రీధర్, రవి, నరేశ్, శ్యామ్, రవీంద్రవర్మ, కృష్ణ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన



ఐడీఎల్ లేక్‌ను సందర్శించిన విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం, విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఐడీఎల్ లేక్‌ను సందర్శించారు. చుట్టు పక్కల ఉన్న దుకాణాలు, వ్యాపారులకు కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.కరుణాకర్, కంపెనీ సీఎస్ఆర్ చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

గోమాతలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి



కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కాంతారావు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ చెరువు కేంద్రంగా గోమాతలను విక్రయిస్తున్నారని, గోవులను విక్రయించే ముఠాపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు డిమాండ్ చేశారు. గంగిరెద్దుల ముసుగులో గోవులను కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కూకట్‌పల్లి పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావుకు ఫిర్యాదు పత్రం అందజేశారు. గోమాతను రక్షిస్తూ.. గోవులను విక్రయించే ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న ఆవులను తక్షణమే గోశాలలకు తరలించేందుకు చర్యలు ప్రారంభించాలని మాధవరం కాంతారావు పోలీసులను కోరారు.

అభివృద్ధికి ప్రతీక @ నల్లచెరువు



● కూకట్‌పల్లిలో శరవేగంగా చెరువు సుందరీకరణ

● వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు

కూకట్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువు సుందరీకరణ కూకట్‌పల్లికి ఐకాన్‌గా మారనుంది. హైడ్రా అధికారుల పర్యవేక్షణలో చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దాదాపు పనులు చివరి దశకు చేరుకున్నాయి. వారంలో సీఎం రేవంత్‌రెడ్డి నల్లచెరువును ప్రారంభిస్తారని అధికారులు తెలుపుతున్నారు. ఈ మేరకు నల్ల చెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించారు.

హైడ్రా పర్యవేక్షణలో...

కూకట్‌పల్లికి తలమానికంగా ఉన్న నల్లచెరువులో గతంలో కొన్ని అక్రమణలు జరిగిన విషయం తెలిసిందే. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్ లెవల్ వరకు ఉన్న అక్రమణలు తొలగించారు. నల్లచెరువు అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. 16 ఎకరాలకే పరిమితమైన నల్లచెరువును.. ఆక్రమణలను తొలగించి 30 ఎకరాలకు విస్తరించారు. ఈ సారి వానాకాలంలో వర్షాలు అధికంగా కురవడంతో నల్లచెరువు నిండుకుండలా జలకళతో కళకళలాడుతోంది. సుమారు రూ.20కోట్లతో పార్కుతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. శేషాద్రినగర్, వెంకట్రావ్‌నగర్ కాలనీలకు పై నుంచి వచ్చే వరదనీరు నేరుగా చెరువులోకి వెళ్లేలా నాలాలు నిర్మించారు. మొత్తానికి చెరువు రూపురేఖలను హైడ్రా అధికారులు పూర్తిగా మార్చేశారు.



నల్ల చెరువుపై వాకింగ్ ట్రాక్‌కు ప్రధాన గేటును ఏర్పాటు చేస్తున్న హైడ్రా అధికారులు

నల్లచెరువు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి..!

నల్లచెరువు సుందరీకరణ పనులు పూర్తయిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చెరువును ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఒక రోజున ముఖ్యమంత్రి చెరువును ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఈ మేరకు చెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. రాబోయే రోజుల్లో చెరువు సుందరీకరణకు మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు.



నల్లచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు (ఫైల్)

హోటళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

● బాలానగర్ ఏసీపీ నరేశ్‌రెడ్డి

కూకట్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ నరేశ్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. హోటల్, లాడ్జీ యజమానులతో బాలానగర్ పీఎస్‌లో మంగళవానం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలానగర్ పరిధిలో ఉన్న హోటళ్లు, లాడ్జీలకు ఎవరెవరూ వస్తున్నారో.. వారి వివరాలు సేకరించి రోజూ పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యమని, అందులో భాగంగానే పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. హోటల్స్‌కు వచ్చే వారి నుంచి గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని, బ్యాకప్‌తో కూడిన సీసీ కెమరాలు తప్పక ఏర్పాటుచేసుకోవాలని అన్నారు. మైనర్లకు గదులు కేటాయించినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితారెడ్డి, హాజి మియా, వినోద్, ఎస్‌హెచ్‌ఓ నర్సింహారాజు తదితరులు పాల్గొన్నారు.



హోటల్స్, లాడ్జ్ యజమానులతో మాట్లాడుతున్న ఏసీపీ నరేశ్‌రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటా

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్ వద్ద సీవరేజ్ లైన్, స్ట్రాం వాటర్‌లైన్లు బ్లాక్ అవి పరిసర కాలనీ రోడ్లపై డ్రైనేజీ నీరు పారుతోంది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బ్లాక్ అయిన లైన్లను సిబ్బందితో శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు సూచించారు. సమస్యల రహిత డివిజన్‌గా మార్చడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, హెచ్ఎండబ్ల్యూఎస్ అడిషనల్ డీజీఎం శివ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారుడు పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు రికవరీ చేసి బాధితునికి మంగళవారం అందజేశారు. ఇటీవల ఓ ఉద్యోగి బైక్‌పై వెళుతూ తన ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను పోగొట్టుకున్నాడు. విషయాన్ని వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు తెలిపాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ల్యాప్‌టాప్ బ్యాగును ఆటో డ్రైవర్ తీసుకున్నట్టు గుర్తించారు. అతని వద్ద ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని బాధితునికి తిరిగి అప్పగించారు. పోయిన ల్యాప్‌టాప్‌ను రికవరీ చేయడంలో కృషి చేసిన కేపీహెచ్‌బీ పోలీసులను కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం దుకాణం మూసివేత



సీజ్ చేసిన మద్యం దుకాణం

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ కాలనీ ప్రధాన రోడ్‌లోని మద్యం షాపును మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు మూసివేశారు. స్థానికులు, సాయిబాబా దేవాలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భాగ్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కొన్ని రోజులుగా చేస్తున్న పోరాటానికి ప్రతిఫలం లభించింది. ఈ విషయంపై "ఇళ్ల మధ్య వైన్‌షాపుతో అవస్థలు" అనే శీర్షికన ఆంధ్రజ్యోతి పలుమార్లు ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అనధికార సెల్లార్‌లో నడుస్తున్న షాపును మంగళవారం మూసివేశారు. అనంతరం మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు షాపును పరిశీలించి లైసెన్స్ పొందిన వారు దాన్ని మరోచోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం షాప్ మూసివేయడంపై అధికారులు, పోలీసులకు భాగ్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● బాక్స్ డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన



అల్లాపూర్ డివిజన్‌లోని క్యాబా మజీద్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ సబీహా బేగం మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో సయ్యద్ నసీర్, జీహెచ్ఎంపీ ఏఈ రంజిత్, స్థానికులు పాల్గొన్నారు.

- అల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

సమస్యలు పరిష్కరించండి

● జడ్‌సీని కోరిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



జడ్‌సీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

గచ్చిబౌలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మంగళవారం వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేను మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియోజకవర్గంలోని యూసఫ్‌గూడ, రెహమత్‌నగర్, వెంకటగిరి, ఎర్రగడ్డ తదితర డివిజన్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్కిల్ అధికారులతో కలిసి ఆయా డివిజన్లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జడ్‌సీ హామీ ఇచ్చారు. జడ్‌సీని కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను కాంగ్రెస్ యువనాయకుడు పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు కలిశారు.



ఫంక్షన్‌హాల్ శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఫంక్షన్‌హాల్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పీజేఆర్‌నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరతుందని, అందరికీ అందుబాటులో ఉండేలా అన్ని సౌకర్యాలతో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, యాదగిరి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కావూరి హిల్స్‌లో మురుగు పరుగు

హైటెక్‌సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని కావూరిహిల్స్ ప్రధాన రహదారిలో నిత్యం మురుగు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. రెండు నెలలుగా సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఈ సమస్య ఉంటుంది. ప్రధాన రహదారిలోని యూటర్న్ ఐసీఐసీఐ బ్యాంకు ముందు నుంచి సుమారు కిలో మీటర్ దూరం వరకు మురుగు నీళ్లు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నడిచి వెళ్లేవారు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోని మ్యాన్‌హోళ్లను క్లీన్ చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, శిల్పాగార్డెన్, ఉడ్‌ల్యాండ్ ప్రీమియర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి ఆయన కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. అవసరమైన చోట మ్యాన్‌హోళ్లు, ఔట్‌లెట్, రోడ్లకు మరమ్మతులు చేస్తామన్నారు. సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ శిరీష, డీఈ ఆనంద్, జలమండలి మేనేజర్ సందీప్, నాయకులు మారబోయిన రాజుయాదవ్, గణేష్‌ముదిరాజ్, రాములు, సత్యం, శశాంక్, పవన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వరదనీటి కాల్వ పనులు ప్రారంభం..

మసీద్‌బండలో రూ.3.96కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టబోయే వరదనీటి కాల్వ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం చెరువులు, అలుగుల నుంచి వచ్చే నీటిని నేరుగా కాల్వలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నా: కార్పొరేటర్

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా అక్కడికి వెళ్లి పరిష్కారానికి కృషిచేస్తున్నామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్డు వద్ద సీవరేజ్ లైన్, స్ట్రాం వాటర్‌లైన్లు బ్లాక్ కావడంతో పరిసర కాలనీల్లోని రోడ్లపై మురుగు నీరు పొంగిపొర్లుతోంది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరించారు. డివిజన్‌ను సమస్యల రహితంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



భూగర్భ డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

మౌలిక వసతుల కల్పనలో రాజీపడం

● కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనలో రాజీపడేది లేదని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. డ్రీమ్ వ్యూ కాలనీ, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అసోసియేషన్ల సభ్యులతో కలిసి కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యకు పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే ప్లే పార్కులో క్రీడా పరికరాల గురించి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, నరసింహరావు, నాగయ్య, ప్రణయ్, అరుణ, జయలక్ష్మి, శ్రీధర్, రవి, నరేశ్, శ్యామ్, రవీంద్రవర్మ, కృష్ణ పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

గచ్చిబౌలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లోని ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎకరా 20గుంటల పార్కు స్థలాన్ని కాపాడాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్కు స్థలం రెండేళ్లుగా కబ్జాకు గురవుతుందని, జీహెచ్‌ఎంసీకి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి, అక్రమంగా అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. దీనిపై తాను కోర్టును ఆశ్రయించడంతో ఆర్డీఓ విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. హైడ్రా అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నిఖిల్(ఫైల్)

చందానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న జీహెచ్‌ఎంసీ టిప్పర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలైన యువకుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఇందుర్తి గ్రామానికి చెందిన హవేలి సామరావు కుటుంబంతో కలిసి పాపిరెడ్డికాలనీ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నాడు. ఆయన కుమారుడు నిఖిల్(27) సోమవారం తన ఇంటికి వచ్చిన స్నేహితుడు అనిల్‌ను శాంతినగర్‌లోని అతడి ఇంటివద్ద దింపేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. సురభీకాలనీ సమీపంలోని స్మశానవాటిక రోడ్డు పక్కన ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



అధికారులు మూసివేసిన మద్యం దుకాణం

మద్యం దుకాణం మూసివేత

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు భాగ్యనగర్ కాలనీ ప్రధాన రోడ్డులోని మద్యం షాపును మంగళవారం మూసివేశారు. స్థానికులు, సాయిబాబా ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భాగ్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కొన్ని రోజులుగా చేస్తున్న పోరాటానికి ప్రతిఫలం లభించింది. కొన్ని రోజులుగా ఆంధ్రజ్యోతిలో ఇళ్ల మధ్య వైన్‌షాపుతో అవస్థలు, మద్యం దుకాణం వద్దంటూ మహాధర్నా, ప్రజావాణిలో ఎమ్మెల్యే గాంధీ ఫిర్యాదు వంటి వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణంలో అనాధికార సెల్లార్‌లో నడుస్తున్న షాప్‌ను బంద్ చేశారు. అనంతరం మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు సైతం షాప్‌ను పరిశీలించి లైసెన్స్ పొందినవారు దాన్ని మరోచోటకు మార్చుకోవాలని సూచించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆంధ్రజ్యోతికి, ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

గచ్చిబౌలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శేరిలింగంపల్లి ఆధ్వర్యంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు సహకారంతో డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయం వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా, తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రేమ పేరుతో దగ్గరై మోసం

బేగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఉప్పరపల్లికి చెందిన ఓ యువతి(26)కి సనత్‌నగర్ జెక్ కాలనీలోని వాసవి ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కృష్ణకాంత్(30)కు ఆరు నెలల క్రితం పరిచయమైంది. ప్రేమ పేరుతో వీరు తరచూ కలుసుకునేవారు. వివాహం చేసుకుందామని ఆ యువతిని నమ్మించాడు. పెళ్లికి పెద్దలు అంగీకరించారని అతడు చెప్పడంతో యువతి నమ్మింది. దీంతో ఇద్దరు తరచూ కలవడంతో పాటు శారీరకంగా దగ్గరయ్యారు. ఇటీవల యువతికి ముఖం చాటేయడంతో అతడిని నిలదీసింది. పెళ్లికి కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని అతడు చెప్పాడు. దీంతో ఆ యువతి మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. యువతి గత నెల 24వ తేదీన సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరిపారు. యువతి ఫిర్యాదు మేరకు కృష్ణకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వెండి ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వైద్యుడి ఇంట్లో వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. జూబ్లీహిల్స్‌లో ఉండే డాక్టర్ సురేష్‌రాయ్ ప్రభుత్వ విభాగం వైద్యుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. గత నెల 25న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి వెళ్లిన ఆయన తిరిగి వచ్చి తిరుపతి వెళ్లారు. అనంతరం ఈనెల 1న ఇంటికి వచ్చి చూడగా 5 జతల వెండి పట్టీలు, 50 తులాల వెండి పురాతన కాయిన్ బాక్స్, జర్మన్ సిల్వర్ సెట్స్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులతో కలిసి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పున్నారెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గాజులరామారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడడం మన అందరి బాధ్యత అని టీపీపీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా గాజులరామారం ఎస్పీఆర్ గ్లోబల్ స్కూల్లో విద్యార్థులతో కలిసి బస్తీల్లో మొక్కలు నాటి ప్రజలకు పర్యావరణం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే చిన్న పనుల వల్ల పెద్ద మార్పును తీసుకు రావచ్చునని, వాహనాల వినియోగం తగ్గించి కాలినడకన వెళ్లాలని, నాటిన ప్రతీ మొక్కకు తప్పని సరిగా నీళ్లు పోసి రక్షించాలన్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశం మాట్లాడుతున్న మల్లారెడ్డి

'కార్మిక హక్కుల సాధనకు బీఎంఎస్‌ను గెలిపించాలి'

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి పురపాలక సంఘంలోని హిల్టన్ టుబాకో పరిశ్రమ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆయన కార్మికులతో సమావేశాన్ని నిర్వహించి, గతంలో రెండసార్లు బీఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో మంచి వేతన ఒప్పందాలు కుదిర్చి అందజేశామని మల్లారెడ్డి అన్నారు. ఈ నెల 3న జరిగే ఎన్నికల్లో బీఎంఎస్ అభ్యర్థిని గెలుపించుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం, జయచంద్రర్, రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సతీష్‌సాగర్, ఎల్లారెడ్డి, సంపత్, కార్మికులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు పెంచాలి


రాంచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

షాపూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూరారం వచ్చిన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్‌ను జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర్‌బాబు, జేమ్స్, గూడ ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ విద్య ఉపాధి, ఉద్యోగాలలో షెడ్యూల్డు కులాలకు రిజర్వేషన్లు పెంచాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాబూరావు, బేకు ఆనంద్‌బాబు, గణేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డేంజరైనా.. రాంగ్‌రూటే!

- చిత్తారమ్మ ఆలయం వద్ద రోడ్డు దాటేస్తున్న ద్విచక్ర వాహనదారులు
- విరిగిపోతున్న ట్రాఫిక్ పోల్స్


రోడ్డుపై రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలు

గాజులరామారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా.. వాహనదారుల్లో మార్పు రావడం లేదు. గాజులరామారం డివిజన్‌లోని చిత్తారమ్మ దేవి ఆలయం వద్ద రోడ్డుపై కొంతమంది వాహనదారులు రాంగ్‌రూట్‌లో వస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండగా, మరికొందరు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పోల్స్ సందుల్లోంచి వస్తూ, ఇతర వాహనదారులకు అడ్డు తగులుతున్నారు. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు జరగడంతో ప్రమాదాల నివారణ కోసం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో ట్రాఫిక్ పోల్స్ ఏర్పాటు చేసినా కూడా వాహనదారుల బుద్ధి మారడం లేదు. దీనికి తోడు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఆలయ ముఖ ద్వారాన్ని ఆనుకొని ఉన్న రోడ్డు నుంచి వెళ్తుండటంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు, అధికారులు స్పందించి ట్రాఫిక్ నియమాలు పాటించని, అడ్డదిడ్డంగా వస్తున్న వాహనాలపై నిఘా ఉంచి , జరిమానాలు విధించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

షాపూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ న్యూషాపూర్‌నగర్‌లో బస్తీ సమస్యలపై స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మంగళవారం పర్యటించారు. డివిజన్‌లోని పలు స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం స్థానికులను బస్తీలో నెలకొన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. సమస్య తీవ్రంగా ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భగత్

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

షాపూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):స్కూల్ యజమాన్యం పర్యవేక్షణ కొరవడటం, చిన్నారుల భద్రతపై శ్రద్ధ చూపకపోవడంతోనే పూర్ణిమ స్కూల్‌లో ఒక కేర్‌టేకర్ చిన్నారి అనుచితంగా ప్రవర్తించిందని కుత్బుల్లాపూర్ ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి జి. భగత్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో భగత్ మాట్లాడుతూ, పూర్ణిమ స్కూల్‌లో ఘటన వెలుగు చూసినప్పటి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. క్రమశిక్షణ పేరుతో టీచర్లు, పాఠశాల యాజమాన్యలు చిన్నారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.


ఎల్ఓసీని అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

సీఎం సహాయ నిధి ఎల్ఓసీ అందజేత

నిజాంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్‌కు చెందిన పి.ప్రవల్లిక కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో ఆమె ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని కొందరు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సిఫార్సుతో ముఖ్యమంత్రి సహా య నిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని మంగళవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారు ప్రవల్లికకు హన్మంత్‌రెడ్డి అందజేశారు. నాయకులు సంజీవ రెడ్డి, లక్ష్మణ్, ఆజం తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా చట్టంపై అవగాహన అవసరం

షాపూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అన్నారు. మానవ హక్కుల సమితి హక్కుల పక్షోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు కార్యక్రమాన్ని బుధవారం సూరారం డివిజన్, న్యూ లాల్‌బహదూర్‌నగర్‌లోని శారదా విద్యా భవన్‌లో నిర్వహించారు. రాజ్యాంగ ప్రవేశిక, ఆహార భద్రతా చట్టం, జాతీయ న్యాయ సేవాధికార చట్టంపై విద్యార్థులకు మధుబాబు చికిలే అవగాహన కల్పించారు.


అయ్యప్ప పడిపూజ

రంగారెడ్డినగర్ ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా జరిగింది. కలశపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు.

విద్యుత్ వృథాకు చెక్!

- వీధి దీపాలకు టైమర్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వీధి దీపానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో పగటి పూట కూడా విద్యుద్ దీపాలు వెలుగడం వల్ల విద్యుత్ వృథా అవుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 2న 'పట్ట పగలే విద్యుత్ వెలుగులు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి సర్కిల్ విద్యుత్ అధికారులు రఘుపతిరెడ్డి స్పందించారు. మంగళవారం పద్మానగర్, వాజ్‌పేయినగర్, ప్రసూననగర్ వివేకానంద నగర్‌ల్లో విద్యుత్ దీపాలు నిర్ణీత సమయంలో వెలిగేలా టైమర్లు అమర్చారు. విద్యుత్ వృథా కాకుండా తన వంతు కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


వాజ్‌పేయినగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలు

కొమ్మలను నరికి రోడ్డుపై పడేశారు!

కుత్బుల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వాజ్‌పేయినగర్‌లో కొమ్మలు బాగా పెరిగి చెట్టు కూలిపోయేలా ఉండటంతో స్థానికుల విన్నపం మేరకు అధికారులు చెట్టు కొమ్మలను నరికించారు. ఆ కొమ్మలను రోడ్డు పక్కన వేసి చేతులు దులిపేసుకున్నారు. కొమ్మల వల్ల రోడ్డు ఇరుకుగా మారింది. మున్సిపల్ సిబ్బంది రోడ్డుపై పడిఉన్న చెట్టు కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అంజిత్ కుమార్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ యువకుడి ఉసురు తీసింది. ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా లారీని వెనక్కి తీసుకోవడంతో వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. బిహార్ రాష్ట్రం ముజఫర్ నగరానికి చెందిన అంజిత్ కుమార్ (23) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. దేవరాంజల్ గ్రామంలోని మల్లన్న కాలనీలో నివాసముంటూ, 9 నెలలుగా స్విగ్గీ డెలవరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గుండ్లపోచంపల్లి వెళ్లి పార్శిల్‌ను డెలివరీ చేసి కొంపల్లికి తిరిగి బయలుదేరాడు. మార్గం మధ్యలోని బ్రిడ్జి సమీపంలో పార్కింగ్ చేసేందుకు వెనక్కి తీసుకుంటున్న లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అంజిత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.